# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 274 | గురువారం 6 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



# మోదీ ఏకగ్రీవం



- రాష్ట్రపతిని కలుసుకోనున్న ఎన్డీయే నేతలు
- ఎన్డీయే నేతగా నరేంద్ర మోదీ పేరుకు మద్దతు
- ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఎన్డీయే కీలక సమావేశం
- 17వ లోక్‌సభ రద్దు
- 18వ లోక్‌సభ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ,
- 17వ లోక్‌సభను రద్దు చేయాల్సిందిగా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం నిర్ణయం

న్యూఢిల్లీ

కేంద్రంలో బీజేపీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఎన్డీయే కూటమి ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఎన్డీయే నేతగా నరేంద్ర మోదీ పేరుకు మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో సుమారు గంటన్నర సేపు జరిగిన ఎన్డీయే కీలక సమావేశంలో ఈ నిర్ణయిం తీసుకున్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు లేఖలను కూటమి కీలక భాగస్వాములుగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జేడీయూ నేత నితీష్ కుమార్ అందజేశారు. -మిగతా2లో



# కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ

- చంద్రబాబు ఏయే శాఖలు అడగొచ్చు..!?
- కేబినెట్‌లో ఏయే శాఖలు తీసుకోవచ్చు..?
- సహాయక శాఖలకే పరిమితం కావొచ్చా..?
- అనేదానిపై ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఒక్కటే చర్చ
- ఇద్దరు యంగ్ ఎంపీలు, మరో ముగ్గురు సీనియర్లను సెలక్ట్ చేశారని గుసగుసలు


న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమికి త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. 'నారా చంద్రబాబు నాయుడు అనే నేను..' అంటూ జూన్-12న టీడీపీ అధినేత ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలుస్తోంది. ఇక జనసేన నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఇద్దర్ని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇంతవరకూ అంతా ఓకే కానీ.. 16 ఎంపీ సీట్లు ఉన్న టీడీపీకి కేంద్ర కేబినెట్‌లోకి చోటు ఉంటుందా.. లేదా..? ఉంటే ఎవరెవర్ని మంత్రి పదవులు వరించొచ్చు..? సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుందా లేకుంటే యువ ఎంపీలకు ఉంటుందా..? కేబినెట్‌లో ఏయే శాఖలు తీసుకోవచ్చు..? సహాయక శాఖలకే పరిమితం కావొచ్చా..? అనేదానిపై ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఒక్కటే చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో మంత్రి పదవులు, శాఖల గురించి -మిగతా2లో

# మళ్లీ భారీ వర్షాలు, వరదలు

- 25కి చేరిన మృతులు
- భారీ వర్షాలు, వరదలతో ఈశాన్యంలోని పలు రాష్ట్రాలు అతలాకుతలం
- వరదల వల్ల 10 జిల్లాల్లోని మొత్తం 4.23 లక్షల మంది ప్రజలు రాశ్రయులయ్యారని వెల్లడి
- భారీ వర్షాలకు బ్రహ్మపుత్ర, కొపిలి, కుషియారా నదులు పొంగి ప్రవహిస్తున్నాయి






# బీజేపీతో కేసీఆర్ బేరసారాలు..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ.. ఆత్మప్రబోధానుసారం నడుచుకోండి
- మీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఓట్లు బదలాయించారు
- అందుకే బీజేపీ గెలిచిన ఏడు స్థానాల్లో
- బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు
- కేసీఆర్ ఉన్నంతకాలం కుట్రలు, కుతంత్రాలు
- ఎన్నికల ఫలితాలను ఉగాది పచ్చడిలా స్వీకరిస్తా
- ఏపీతో సమస్యల్ని పరిష్కరించుకుంటాం
- మోదీని ప్రజలు తిరస్కరించారు.. ఆయన మళ్లీ
- ప్రధాని పదవి చేపట్టకూడదు: సీఎం రేవంత్
- డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- సోనియాగాంధీని ఆహ్వానిస్తాం: సీఎం

హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బీజేపీతో బేరసారాలు చేసుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికైనా అలోచించి.. ఆత్మప్రభోధానుసారం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు ఆత్మబలిదానం చేసుకుని.. అవయవదానం చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించారని అన్నారు. బీజేపీ గెలిచిన 8 సీట్లకుగాను ఏడు సీట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం సీఎం రేవంత్ తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల బరిలో కేసీఆర్ బలహీన అభ్యర్థులను నిలిపి.. బీఆర్ఎస్ శ్రేణులను బీజేపీ కోసం పని చేయిస్తున్నారని తాను ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పుడే చెప్పానని గుర్తు చేశారు. సిద్దిపేట అసెంబ్లీ -మిగతా3లో

# ఆదాయ వనరులపై నజర్



- ఆదాయం పెంచుకొనే దిశగా అడుగులు
- అటు పాలన. ఇటు పథకాల అమలులో దూకుడు
- రియల్ ఎస్టేట్ కు మంచి ఊపు రావడమేగాక రాష్ట్ర ఆదాయం కూడా భారీగా పెరగనుంది
- భాగ్యనగరంలో భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో సొంతింటి కలలను సాకారం చేసుకునే దిశగా మధ్యతరగతి వర్గం అడుగులు
- ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి వర్గాల అవసరాలకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ సంస్థలు ఆకర్షణీయ మరియు అందుబాటు ధరలతో

హైదరాబాద్

తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటూ దూసుకుపోతోంది. అటు పాలన. ఇటు పథకాల అమలు లో దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే.. సీఎం రేవంత్ రెడ్డి మరో కొత్త నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ కు మంచి ఊపు రావడమేగాక రాష్ట్ర ఆదాయం కూడా భారీగా పెరగనుంది. భాగ్యనగరంలో భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో సొంతింటి కలలను సాకారం చేసుకునే దిశగా మధ్యతరగతి వర్గం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి వర్గాల అవసరాలకు అనుగుణంగా -మిగతా2లో

# ప్రతి ఓటూ బాధ్యత గుర్తుచేసేదే

- ప్రజలు నమ్మి కనీవినీ ఎరుగని విజయమిచ్చారు
- రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ కష్టాల్లోనే
- వారికి ఏ కష్టం వచ్చినా, ఏ నష్టం పలకరించినా
- జనసేన ఆఫీసు తలుపులు తెరిచే ఉంటాయి
- ప్రజాప్రతినిధులు ఇలా ఉంటారని
- ప్రజలు అనుకునేలా పని చేద్దాం
- విజేతలకు అధినేత దిశా నిర్దేశం




అమరావతి

'ప్రజలు మనల్ని బలంగా నమ్మారు. కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారు. మనకు వచ్చిన ప్రతి ఓటూ మన బాధ్యతను గుర్తుచేసేదే. ఐదు కోట్ల మందికి జవాబు దారీగా ఉండాలి' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ తరఫున విజేతలుగా నిలిచిన అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. 'ప్రజల కష్టం నుంచి చెల్లించే పన్ను -మిగతా3లో



# మోదీకి వ్యతిరేకంగా జనం తీర్పునిచ్చారు

- ఇండియా సమావేశంలో ఖర్గే
- ప్రజాతీర్పు వ్యక్తిగతంగా మోదీకి రాజకీయ ఓటమి మాత్రమే కాకుండా నైతికపరమైన ఓటమి కూడా
- ప్రధాని మోదీ, ఆయన తరహా రాజకీయలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చారు

# మోదీకి వ్యతిరేకంగా జనం తీర్పునిచ్చారు

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పునిచ్చారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అన్నారు. ప్రజాతీర్పు వ్యక్తిగతంగా మోదీకి రాజకీయ ఓటమి మాత్రమే కాకుండా నైతికపరమైన ఓటమి కూడా అని అభివర్ణించారు. ప్రధాని మోదీ, ఆయన తరహా రాజకీయలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అయినప్పటికీ ఆయన (మోదీ) ప్రజాభీష్టాన్ని కాలరాయడానికే కృతనిశ్చయంతో ఉన్నారని విమర్శించారు. ఎన్నికల ఫలితాల అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు 'ఇండియా' కూటమి నేతలు శుక్రవారం సాయంత్రం ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో సహా 30 మందికి పైగా నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే సమావేశాన్ని ప్రారంభిస్తూ, లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా, దృఢ సంకల్పంతో పనిచేసిన 'ఇండియా' కూటమి నేతలు అభినందించారు. నరేంద్ర మోదీపై ప్రజల సెంటిమెంట్ గణనీయంగా మారినట్టు 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విస్పష్టంగా తెలిపాయని అన్నారు. మోదీ నాయకత్వంపైనే ఎన్నికల ప్రచారం భారీగా జరిగినప్పటికీ, ఆయన పేరు, ఇమేజ్‌పై ప్రచారం సాగించినప్పటికీ బీజేపీకి సొంతంగా మెజారిటీ సాధించడంలో విఫలమైందని, తద్వారా మోదీ నాయకత్వాన్ని ప్రజలు తోసిపుచ్చినట్టు చాలా స్పష్టంగా తేలుతోందని అన్నారు. "మోదీకి ఇది వ్యక్తిగతంగా రాజకీయ ఓటమి మాత్రమే కాదు. నైతికపరమైన ఓటమి కూడా. వాళ్ల (బీజేపీ) అలవాట్లు ఏమిటో మనందరికీ తెలుసు. ప్రజాభిప్రాయాన్ని తిరస్కరించేందుకు ఏమి చేయాలో అవన్నీ చేస్తారు. రాజ్యాంగ విలువలు, రాజ్యాంగం ప్రసాదించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని పరిఢవిల్లేలా చేసేందుకు కృషి చేసిన ఇండియా కూటమి పార్టీలను



స్వాగతిస్తున్నాం" అని ఖర్గే చెప్పారు.

**33 మంది నేతలు హాజరు..**

'ఇండియా' కూటమి సమావేశంలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు శరద్ పవార్ (ఎన్‌సీపీ), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), ఎంకే స్టాలిన్ (డీఎంకే), టీఆర్ బాలు (డీఎంకే), అఖిలేష్ యాదవ్ (ఎస్‌పీ), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), అరవింద్ సావంత్ (శివసేన-యూబీటీ), తేజస్వి యాదవ్ (ఆర్జేడీ), సంజయ్ యాదవ్ (ఆర్జేడీ), సీతారాం ఏచూరి (సీపీఎం), సంజయ్ రౌత్ (శివసేన-యూబీటీ), డి.రాజా (సీపీఐ), ఛంపాయ్ సోరెన్ (జేఎంఎం), కల్పానా సోరెన్ (జేఎంఎం), సంజయ్ సింగ్ (ఏఏపీ), రాఘవ్ చద్దా (ఏఏపీ), దీపక్ భట్టాచార్య (సీపీఐ-ఎంఎల్), ఒమర్ అబ్దుల్లా (జేకేఎన్‌సీ), సయ్యిద్ సిద్ధిఖీ అలి సాహిబ్ థాంగల్ (ఐయూఎంఎల్), పీకే కున్హలికుట్టీ (ఐయూఎంఎల్), జోష్ కె మణి (కేసీ-ఎం), తిరు తోల్ తిరుమావళవన్ (వీసీకే), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్‌పీ), డాక్టర్ ఎంహెచ్ జవహిరుల్లా (ఎంఎంకే), జి.దేవరాజ్న్ (ఏఐఎఫ్‌బీ), తిరు ఈఆర్ ఈశ్వరన్ (కేఎండీకే), డి.రవికుమర్ (వీసీకే) హాజరయ్యారు.

# గులాబీకి పార్లమెంట్‌లో లేని ప్రాతినిధ్యం

**హైదరాబాద్ :** ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయనే సామెత సమకాలీన రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితికి సరిగ్గా సరిపోతుందని చెప్పాలి. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత తొలి పార్లమెంట్ ఎన్నికలకు కేసీఆర్ కుటుంబం దూరంగా ఉండటం బీఆర్ఎస్‌ను ఊహించని దెబ్బ కొట్టింది. లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకుండా పోవడం మరో దెబ్బ. 2014 నుంచి 2023 నవంబర్ వరకు దాదాపు పదేళ్లు తెలంగాణ అధికార పార్టీగా చక్రం తిప్పిన బీఆర్ఎస్‌కు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు చేదు ఫలితాన్ని అందించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరూ పార్టీని వీడటం బీఆర్ఎస్‌ను మరింత దెబ్బకొట్టింది. ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖాతా తెరవలేకపోవడం ఊహించని పరిణామమే. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత బీఆర్ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి కేసీఆర్ కుటుంబం నుంచి ఎవరూ లోక్‌సభ బరిలో నిలబడలేదు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కేసీఆర్ ఎంపీగా గెలిచారు. అప్పటి యూపీఏ సర్కారులో ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2006, 2008లో జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఉపఎన్నికలో ఆయన విజయం సాధించారు. 2009లో ఆయన మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించడంతో కేసీఆర్ సీఎం అయ్యారు. ఆ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కేసీఆర్ కుమార్తె కవిత ఎంపీగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఆమె బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. అలాగే కేసీఆర్ కుటుంబం నుంచి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయలేదు.వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు చాలా మంది విముఖత చూపారు. టికెట్ ప్రకటించిన తర్వాత చాలా మంది పార్టీ ఫిరాయించారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సాధించిన విజయంతో బీఆర్ఎస్ అగ్ర నేతలు తామేదో అద్భుత విజయం సాధించామని ఇదే విజయ పరంపర ఇకపై కొనసాగుతుందని ధీమాను వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు చాలా తేడా ఉంటుంది. అక్కడ అనుకూలించే అంశాలు వేరేరకంగా ఉంటాయి. అయితే రీసెంట్ ఎగ్జిట్ పోల్స్ అంశాలు , ప్రస్తుత ఓటింగ్ సరళి పరిశీలిస్తే బీఆర్ఎస్ కు అనుకూలంగా లేవని అర్థం అవుతోంది. దాదాపు 12 సంస్థల ఎగ్జిట్ పోల్ అంచనాలు పరిశీలిస్తే బీఆర్ఎస్ పతనం దిశగా అడుగులు పడుతున్నట్లే కనిపిస్తోంది. పార్లమెంట్ ఫలితాల సరళి కూడా అలానే ఉంది. ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కు పతనం తప్పదని రాజకీయ పండితులు లెక్కలు వేస్తున్నారు. మరికొందరైతే ఫలితాల తర్వాత మళ్లీ కేసీఆర్ ఫాంహౌస్ కే పరిమితం అవుతారని జోస్యం చెబుతున్నారు.పదేళ్ల పాటు తిరుగులేని అధికారం చెలాయించిన బీఆర్ఎస్ పతనం అంచున పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కించుకున్న గులాబీ పార్టీ పార్లమెంట్ ఫలితాలు వచ్చే నాటికి కేవలం సింగిల్ డిజిట్ లేక సున్నా స్థానాలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా గంపగుత్తగా బీఆర్ఎస్ పరిస్థితి దాదాపు ఇంతే అన్నట్లుగా అంచనా వేశాయి. ఎమ్మెల్సీ విజయం చూపించి కార్యకర్తలలో ఆత్మస్థయిర్యం నింపే ప్రయత్నాలు చేస్తున్నారు బీఆర్ఎస్ అగ్రనేతలు. నేటి ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి ఏమిటని బీఆర్ఎస్ నేతలు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే ఇతర పార్టీలకు వలస వెళ్లిన నేతలతో సహా కొత్తగా మరింతమంది పార్టీని వీడే సూచనలు కనిపిస్తున్నాయి అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని రకాల గాంభీర్యపు ప్రకటనలైనా చేయవచ్చు గానీ, ఈ ఎన్నికల ఫలితాల సరళి మాత్రం కేసిఆర్ దళం పతనాన్ని స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి. 12 సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్ ఫలితాలలో.. ముగ్గురు భారత రాష్ట్ర సమితికి కేవలం సున్న స్థానాలు మాత్రమే దక్కుతాయని అంచనా వేశారు! అదే సమయంలో మరో నాలుగు సంస్థలు సున్న నుంచి ఒక్క స్థానం దక్కే అవకాశం ఉన్నదని చెప్పుకొచ్చాయి. ఒక సంస్థ నుంచి మూడు స్థానాలు దక్కుతాయని అంచనా వేస్తుండగా, మరో ఇద్దరు రెండు స్థానాలు గెలుస్తారని, ఒకే ఒక్క సంస్థ న్యూస్ 18 మాత్రం రెండు నుంచి ఐదు స్థానాలలో భారత రాష్ట్ర సమితి విజయం సాధిస్తుందని అంచనావేయడం జరిగింది. అయితే వీటన్నింటికీ భిన్నంగా అస్సలు ఒక్క స్థానంలో కూడా బీఆర్ఎస్ పోటీ ఇవ్వలేక మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.పార్లమెంటు ఎన్నికలలో కూడా ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా ఉండబోతున్నదని ముందే అర్థమైంది ఆ పార్టీ ఎంపీలు పలువురు భారతీయ జనతా పార్టీ కాంగ్రెసులలో చేరిపోయారు. అలాగే టికెట్లు కేటాయించే సీజన్ వచ్చిన తర్వాత ఎంపీ టికెట్లు ఇస్తామంటే పలువురు సీనియర్ నాయకులు మాకు వద్దంటే వద్దంటూ తిరస్కరించారు. ఎంపీగా పోటీ చేసే ఉద్దేశం లేదని అన్నారు. కొందరైతే టికెట్ ప్రకటించిన తర్వాత కూడా మాకు వద్దని తిరస్కరించారు. ఒకవైపు కేసీఆర్ పిలిచి మరీ టికెట్ ఇస్తానని అన్నప్పటికీ పుచ్చుకోకుండా వద్దని అన్నవారు.. మరొక పార్టీలోకి గెంతి అక్కడ టికెట్ తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.భారత రాష్ట్ర సమితి పార్లమెంటు ఎన్నికలలో ప్రభావశీలంగా ఉండగలదనే నమ్మకం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులలో పూర్తిగా సన్నగిల్లి పోయింది. వారందరి అంచనాలకు తగినట్లుగానే ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా వచ్చాయి. ఇవన్నీ ఉత్తుతివే అని, మేము గెలిచి తీరుతాము అని, తండ్రి కొడుకులు చెప్పుకోవచ్చు గాక.. ఇంకో రెండు రోజుల్లో ఆ మాట చెప్పగల అవకాశాన్ని కూడా వారు కోల్పోతారు! ఇప్పటికైనా మేలుకుంటే కనీసం రాబోయే ఐదేళ్లలో పార్టీని కాపాడుకోవడానికి వారు శ్రద్ధ పెట్టడం కుదురుతుంది. ఇంకా అహంకారం వీడకుండా, వాస్తవాలను గుర్తించకుండా ఆత్మవంచనతో నడుచుకుంటే నష్టపోయేది కల్వకుంట్ల కుటుంబమే.ఐదు నెలల కాంగ్రెస్ పాలనకు, తమ పదేళ్ల పాలనకు తేడా చూసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని కేసీఆర్ కేటీఆర్, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు విస్తృతంగా ప్రచారం చేసినా ఆదరించలేదు. పోటీచేసిన స్థానాల్లో మహబూబాబాద్, ఖమ్మంలో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లో లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన 14 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలోలో నిలిచింది.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పోలైన ఓట్లలో బీఆర్ఎస్ కేవలం 16.69 శాతం ఓట్లు మాత్రమే రాబట్టగలిగింది. సంఖ్యాపరంగా ఇది పెద్దగానే కనిపిస్తున్నా అవి సీట్ల రూపంలోకి మారలేదు. ఓట్లపరంగా చూస్తే ఇది కేవలం 36 లక్షల 19 వేల 626 మాత్రమే.

# ఇక పొలిటికల్ ప్రిడిక్షన్స్ ఉండవు

**విజయవాడ :** వేణు స్వామి.. అయితే కాషాయం లేకుంటే పసుపు వర్ణంలో దుస్తులు ధరిస్తాడు. జాతకాలు చెబుతుంటాడు. హీరోయిన్ల పేర్లు మార్చుతుంటాడు. ఒకప్పుడు ఇతన గురించి. అంతగా తెలిసేది కాదు. సోషల్ మీడియా వ్యాప్తి పెరిగిన తర్వాత ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. సెలబ్రిటీ అయిపోయాడు. దీంతో అతడు తనను తాను దైవం సంభూతుడిగా చెప్పుకోవడం మొదలుపెట్టాడు. తను జాతకం చెబితే ఏదైనా జరుగుతుందని.. తన చేతికి మహార్జాతకం ఉందని ప్రచారం చేసుకోవడం ప్రారంభించాడు. అక్కడితోనే అతడు ఆగలేదు. జాతకాలు చెప్పడం మొదలుపెట్టాడు.. ఏం జరగబోతుందో అంచనా వేయడంలో సిద్ధహస్తుడయ్యాడు. అందులో అతడు చెప్పినవి కొన్ని జరిగాయి. దీంతో ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు.. సహజంగానే అంత పేరు వచ్చింది కాబట్టి అతడికి హిపోక్రసీ పెరిగింది. అది అతనిలో అహాన్ని మరింతగా పెంచింది.ఇటీవల వేణు స్వామి తనకు తానుగా చెప్పిన ప్రిడిక్షన్లన్నీ ఎదురు తంతున్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్ కప్ లో భారత్ గెలుస్తుందని చెబితే.. ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని అంటే.. ఆయన కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు.. చివరికి ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయలేకపోయారు.. ఇక ఐపీఎల్ లో హైదరాబాద్ జట్టు గెలుస్తుందని.. కావ్య జాతకం బాగుందని వేణు స్వామి అన్నారు.. కానీ కోల్ కతా చేతిలో దారుణమైన పరాజయాన్ని హైదరాబాద్ మూట కట్టుకుంది. ఏపీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలిచి, రెండవసారి ముఖ్యమంత్రి అవుతాడని వేణు స్వామి జాతకం చెబితే.. అది కూడా తప్పయింది. పైగా వైసిపి అత్యంత దారుణమైన ఓటమిని చవిచూసింది.ఇవేవీ జరగలేదు. పైగా అతను చెప్పిన తర్వాత ఆ వ్యక్తులు ఓటమి పాలయ్యారు. అతడు గెలుస్తాడని చెప్పిన జట్లు పరాజయం పాలయ్యాయి.. దీంతో సోషల్ మీడియాలో వేణు స్వామి చరిష్మా తగ్గింది. అతడి క్రేజ్ పడిపోయింది. స్థూలంగా చూస్తే అతడు మామూలు మనిషి అని తేలిపోయింది. ఇలా వరుసగా అతడు చెప్పిన విషయాలన్నీ అడ్డంగా తన్నడం మొదలు పెట్టడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఏకిపారేయడం మొదలుపెట్టారు.. దీంతో వేణు స్వామి తగ్గాడు. ఇన్నాళ్లపాటు ఆకాశంలో విహరించిన అతడు కిందికి దిగివచ్చాడు.మంగళవారం వెల్లడైన ఫలితాలలో ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దారుణమైన ఓటమిని మూటగట్టుకోవడంతో.. వేణు స్వామి బయటకు వచ్చాడు.. ఇకనుంచి తాను జాతకాలు చెప్పనని స్పష్టం చేశాడు. " కొద్దిరోజులుగా నన్ను కొంతమంది ట్రోల్ చేస్తున్నారు. నేను కేంద్రంలో మోడీ ప్రభావం తగ్గుతుందని చెప్పాను. అది నిజమైంది. చంద్రబాబు ఓడిపోతారని అన్నాను. జగన్ గెలుస్తారని చెప్పాను. కానీ అందుకు విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. నేను నక్షత్రాల ఆధారంగా, జాతకాల ఆధారంగా ప్రిడిక్షన్ చెబుతాను. ఇకనుంచి నేను చెప్పడం మానేస్తాను. నేను నమ్మే ఆ వెంకటేశ్వర స్వామి సాక్షిగా, కామాఖ్య దేవి సాక్షిగా.. జాతకాలు ఇకనుంచి చెప్పను." వేణు స్వామి అన్నాడు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఓడిపోయిన నేపథ్యంలో వేణు స్వామి మీద ట్రోల్స్ మొదలయ్యాయి. దీంతో ఆయన తను ఇక ముందు నుంచి ప్రిడిక్షన్ చెప్పనని స్పష్టం చేశాడు.. ఒక వీడియోలో తన మనోగతాన్ని వెల్లడించాడు.

## మెజార్టీలలోరికార్డ్

**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, బీజేపీ పార్టీ 8 సీట్లు, ఎఐఎంఐఎం ఒక స్థానం గెలుచుకుంది. అందులో చాలా మంది అభ్యర్థులు తమ ప్రత్యర్థుల మీద భారీ మెజార్టీతో గెలుపొందారు. మరికొంత మంది స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుకుకోగా, అత్యల్ప మెజార్టీతో బీజేపీ అభ్యర్థి విజయ తీరాలకు చేరారు.రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఈసారి తొలిసారి లోక్‌సభలో అడుగుపెడుతున్న వారే అత్యధిక మెజార్టీ సాధించడం విశేషం. ఇందులో కాంగ్రెస్ నుంచి గెలిచిన కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, రామ సహాయం రఘురాం రెడ్డి బీజేపీ నుంచి గెలిచిన రఘునందన్ రావు, ఈటెల రాజేందర్, డికె అరుణ, గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. అవకాశం వచ్చిన తొలి ప్రయత్నంలోనే విజయం సాధించి చట్టసభల్లో అడుగుపెడుతున్నారు.అయితే అత్యధిక మెజార్టీతో గెలుపొందింది.. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చింది. ఏకంగా ఐదులక్షల 60వేలకు పైగా అధిక్యంతో ప్రభంజనం సృష్టించారు. తెలంగాణ చరిత్రలోనే భారీ మెజార్టీ సాధించి రికార్డ్ సృష్టించారు రఘువీర్ రెడ్డి. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్గొండ పార్లమెంట్‌పై స్పెషల్ కేర్ తీసుకున్నారు. దేశంలోనే నల్గొండ సెగ్మెంట్లో భారీ అధిక్యత సాధిస్తామని ముందు నుంచి చెప్తున్నారు. బరాబర్ ఐదులక్షల మార్క్ క్రాస్ చేస్తామని సవాల్ చేశారు. పార్టీ సభ్యత్వంలో ఈ ఎంపీ సెగ్మెంట్ మొదటి స్థానంలో ఉందని అదే జోష్‌తో విక్టరీ కొడతామని చెప్పి తమ సత్తా ఏంటో నిరూపించారు.ఇక ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన రఘురాం రెడ్డి సైతం భారీ మెజార్టీ గెలుపొందారు. ఆయన తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై 4,67,847 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిపై 3,91,4753 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితపై 3.49 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారుహైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ఎఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ 3,38,087 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కరీంనగర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ 2,25,209 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి 2,22,170 ఓట్ల తేడాతో విజయఢంకా మోగించారు. వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2,20,339 ఓట్ల తేడాతో రికార్డు విజయం నమోదు చేసుకున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై దాదాపు 1,72,897 ఓట్ల మెజార్టీ సాధించారు. ఇక పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1,31,364 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.నిజామాబాద్ స్థానం నుంచి బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిపై 1,09,241 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు. నాగర్‌కర్నూలులో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ పోతుగంటిపై 94,414 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆదిలాబాద్ లోక్‌సభ సీటు నుంచి బీజేపీ అభ్యర్థి నగేష్ 90,652 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తన సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై 46,188 ఓట్ల తేడాతో గెలుపొందారు. సికింద్రాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై 49,944 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మెదక్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు తన సమీప ప్రత్యర్థిపై 39,139 పైచీలుకు ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు.మహబూబ్‌నగర్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిపై స్వల్ప ఆధిక్యంతోనే విజయం సాధించారు. రౌండ్ రౌండ్‌కు ఆధిక్యాలు మారడంతో నెలకొన్న ఉత్కంఠ పోరులో డీకే అరుణ కేవలం 4,500 ఓట్లతో గట్టెక్కారు.

## మళ్లీ భారీ వర్షాలు, వరదలు..



**అసోం :** రెమాల్ తుపాన్ కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఈశాన్యంలోని పలు రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. ఆ క్రమంలో అసోంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. కాక్రా జిల్లాలో అయిదుగురు నీటి మునిగి మరణించారు. అలాగే నాగవ్ జిల్లాలో మహిళ మృతి చెందింది. ఈ మేరకు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ వరదల వల్ల 10 జిల్లాల్లోని మొత్తం 4.23 లక్షల మంది ప్రజలు రాశ్రయులయ్యారని తెలిపింది. అలాగే 453 గ్రామాలు ప్రస్తుతం నీటి మునిగి ఉన్నాయని వివరించింది. ఇక ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రహ్మపుత్ర, కొపిలి, కుషియారా నదులు పొంగి ప్రవహిస్తున్నాయని పేర్కొంది. దీంతో ఆ యా నదీ పరివాహక ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. మరోవైపు ఈ వర్షాలు, వరదలతో తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందని వెల్లడించింది. అయితే సహాయక పునరావాస చర్యలు కొనసాగుతున్నాయని వివరించింది.

## కూటమికి ప్లస్ ...అదే

**కాకినాడ :** టిడిపి కూటమికి సాలిడ్ గెలుపు లభించింది. అటు వైసీపీకి మైండ్ బ్లాక్ అయ్యేలా ఓటమి తలుపు తట్టింది. ఈ తరహా ఓటమిని వైసిపి అంచనా వేయలేకపోయింది. అదే స్థాయిలో భారీ స్థాయిలో గెలుపును ఊహించలేకపోయింది టిడిపి కూటమి. అయితే ఒకరిది ఓవర్ కాన్ఫిడెన్స్. మరొకరిది సమిష్టి విజయం. కూటమి ప్రతి అడుగు పక్కాగా వేయగా.. వైసీపీని మాత్రం అతి ధీమా కొంపముంచింది. కోలుకోలేని దెబ్బతీసింది. కనీవిని ఎరుగని ఓటమి ఎదురైంది. అయితే ఇది వైసీపీ స్వయంకృతాపమే.ప్రజల్లో నివురు గప్పిన అసంతృప్తిని పసిగట్టడంలో వైసిపి విఫలం అయ్యింది. పెద్ద ఎత్తున ఓటింగ్ పెరగడం కూడా వైసీపీకి మైనస్ గా మారింది. కానీ అదంతా తమ పాజిటివ్ ఓటు బ్యాంకు అని వైసిపి నమ్మింది. సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజల్లో సంతృప్తి శాతం ఉంటుందని వైసీపీ భావించింది. కానీ ప్రజల్లో ఉన్న అసంతృప్తి జ్వాలలను తెలుసుకోలేక పోయింది. అభివృద్ధి విషయంలో అస్సలు పట్టించుకోలేదు. ముందుగా సంక్షేమం అన్నట్టు వ్యవహరించింది. కొత్త పరిశ్రమల రాక, ఉన్న పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించకపోవడం, చాలా పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం కూడా మైనస్ గా మారింది. ఒక్క సంక్షేమ పథకాలు ఆదుకుంటాయన్న ఆలోచన సైతం ఫెయిల్ అయ్యింది.ఇక తెలుగుదేశం పార్టీకి అన్ని శకునాలుగా పని చేశాయి. అన్ని అంశాలు కలిసి వచ్చాయి. ముఖ్యంగా కూటమి ఏర్పాటుతో పరిస్థితి మారిపోయింది. మూడు పార్టీల మధ్య సమన్వయం చక్కగా కుదిరింది. అన్నింటికీ మించి బిజెపిని ఒప్పించడం కలిసి వచ్చింది. అటు నందమూరి, ఇటు మెగా ఫ్యామిలీ కూటమికి అండగా నిలిచింది. చిరంజీవితో ప్రత్యేక ప్రకటన, సినీ పరిశ్రమ నుంచి మద్దతు కలిసి వచ్చాయి. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనుకోని వరంగా మారింది. ఆస్తులకు సంబంధించి ధ్రువపత్రాలపై జగన్ ఫోటోను ఎక్కువమంది వ్యతిరేకించారు. అది భూములు లాక్కునేందుకు చేసిన యాక్ట్ అంటూ విపక్షాలు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. అంతకుముందే చంద్రబాబు అరెస్టుతో ఒక రకమైన సానుభూతి ప్రజల నుంచి వ్యక్తమైంది. ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు అరెస్టు చేశారని, ఏడుపదుల వయసులో ఆయనకు సుదీర్ఘకాలం జైలులో పెట్టడం, అందుకు సహేతుకమైన కారణాలు చూపకపోవడం కూడా మైనస్ గా మారింది. కూటమికి ప్లస్ గా మారాయి.

# ఆదాయ వనరులపై నజర్


-మొదటి పేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ సంస్థలు ఆకర్షణీయ మరియు అందుబాటు ధరలతో వారికి చేరువవుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే నగరంలో భారీ నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకునేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్త వెంచర్లు, బహుళ అంతస్తుల భవంతుల అనుమతుల కోసం నిర్మాణదారులు క్యూ కడుతు?నారు. రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలతో హెచ్ఎండీఏ కూడా తమ ఆదాయ వనరులపై నజర్ పెట్టింది. కొన్ని కీలక ప్రాజెక్టులను చేపట్టనుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి..వచ్చీ రాగానే సంక్షేమ పథకాలు, గ్యారెంటీలపై దృష్టి పెట్టింది. ఈలోగా ఎన్నికల కోడ్ రానే వచ్చింది. ఇక ఫలితాల తర్వాత ఎన్నికల కోడ్ ఎత్తేవేస్తారు. అందుకే కాంగ్రెస్ సర్కార్ తగిన ఆదాయ వనరులపై దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుత పరిస్థితిలో ఆదాయాన్ని పెంచుకునే వనరుగా హెచ్ ఎండీఏ సంస్థ కనిపిస్తోంది. ఈ సంస్థ ద్వారా భారీగా నిధులను సేకరించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. అందుకే గత కొంత కాలంగా నిలిపివేసిన భూ మార్పిడులను మళ్లీ తెరపైకి తీసుకొస్తే ఎలా ఉంటుందన్న విషయంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. గతంలో జరిగిన అవినీతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుని నిబంధనల ప్రకారం సక్రమంగా ఉన్న దరఖాస్తులకు అనుమతులు ఇస్తే సంస్థకు భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారుమాస్టర్ ప్లాన్ లో భాగంగా 111 జీఓ ఎత్తివేయడంతో సీఎల్‌యూ కోసం హెచ్ ఎండీఏ కు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. సీఎల్‌యూ అంటే ఒక జోన్ నుంచి మరో జోన్ లోకి మార్పు చేయాలంటే సీఎల్‌యూ తప్పనిసరిగా ఉండాలి. వాటిని పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికే అనుమతులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అనుమతులు ఇచ్చే విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కూడా అధికారులు నిర్ణయించారు. హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో 12 జోన్లు ఉన్నాయి. 111 జీఓ ప్రాంతాల్లోని 84 గ్రామాలను ఏ జోన్‌లోకి తీసుకోలేదు. ఈ భూములన్నీ ఆంక్షల మధ్య బయో కన్జర్వేషన్ జోన్‌లోనే ఉన్నాయి. అయితే వీటికి నాలా కన్వర్షన్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించే అవకాశం ఉండడంతో .. సీఎల్‌యూ కింద రెసిడెన్షియల్, కమర్షియల్ ఇలా కోరుకున్న జోన్‌లకు మార్పు చేయాలని పలువురు యజమానులు అప్పట్లో హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు. ఇవే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లోనూ కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లకు మార్చాలని కొన్ని దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని పరిశీలించాలని అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే ఈ విషయంలో హెచ్ఎండీఏ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం

# బీజేపీతో కేసీఆర్ బేరసారాలు..

-మొదటి పేజీ తరువాయి

సెగ్మెంట్‌లో బీఆర్ఎసకు వచ్చిన ఓట్లను చూస్తేనే అది అర్థమవుతుందన్నారు. కేసీఆర్ 2001లో టీడీపీకి రాజీనామా చేసి.. పోటీ చేసిన దగ్గర్నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకూ సిద్దిపేటలో బీఆర్ఎసకు ఏనాడూ 30 వేల కన్నా తక్కువ మెజారిటీ రాలేదని రేవంత్ పేర్కొన్నారు. లక్ష ఓట్ల మెజారిటీ వచ్చిన సందర్భం కూడా ఉందన్నారు. కానీ, తాజా లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థికి సిద్దిపేట సెగ్మెంట్‌లో కేవలం 2500 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చిందని తెలిపారు. సిద్దిపేటలో వెంకట్రామిరెడ్డికి 65 వేల ఓట్లు వస్తే.. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 62,500 ఓట్ల వరకు వచ్చాయని పేర్కొన్నారు.



**సిద్దిపేట సెగ్మెంట్ వల్లే ఓడాం..**

హరీశ్‌రావు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మెజారిటీ తగ్గడం వల్లే మెదక్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ ఓటమిపాలైందని రేవంత్ అన్నారు. సిద్దిపేటలో బీఆర్ఎస్.. వారి ఓట్లను బీజేపీ అభ్యర్థికి బదిలీ చేయడం ద్వారా బలహీన వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని నమ్ముకున్న వెంకట్రామిరెడ్డిని కూడా మోసం చేశారని అన్నారు. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం ఓట్లు తెచ్చుకున్న బీఆర్ఎస్.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 16.5 శాతానికి పడిపోయిందని, దాదాపు 22 శాతం ఓట్లను బీజేపీకి బదిలీ చేసిందని అన్నారు. దీంతో.. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 13 శాతం ఓట్లు సాధించిన బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు వచ్చాయన్నారు. 39 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎసకు.. ఈ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే మెజారిటీ దక్కిందని తెలిపారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఆ పార్టీకి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని రేవంత్ గుర్తు చేశారు. ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్యేల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. "ఫీనిక్స్ పక్షిలా బూడిద నుంచి మళ్లీ పుడతామని కేటీఆర్ అంటున్నారు. కానీ, బూడిద నుంచి మళ్లీ పుట్టేదేమీ లేదు. ఆ బూడిదను తీసుకెళ్లి వాళ్ల నాయన కేసీఆర్‌కు, బావ హరీశ్‌రావు ముఖాలకు పూస్తే కథ సుఖాంతమవుతది" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై, పార్టీ నాయకత్వంపై బీఆర్ఎస్ వాళ్లు ఎన్నెన్నో ఆరోపణలు చేశారని, చివరికి ప్రజలు ఈ ఎన్నికల్లో వారికి గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొట్టాలనే కుట్రతో వ్యవహరిస్తే ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తారనే దానికి ఇది నిదర్శనమన్నారు. "ప్రధాన ప్రతిపక్షనేత అయి ఉండి.. రాష్ట్ర అవతరణ దినోత్సవంలో పాల్గొకుండా ప్రజాస్వామిక వ్యవస్థను కేసీఆర్ అవమానిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నరు. ఇప్పటికైనా వారి వ్యవహార శైలి మార్చుకోవాలి. ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలి" అని రేవంత్ సూచించారు.

**కేసీఆర్ రాజకీయ జూదగాడు..**

కేసీఆర్ ఒక రాజకీయ జూదగాడు అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. రాజకీయ ముఖచిత్రంపై కేసీఆర్ ఉన్నంతకాలం కుట్రలు, కుతంత్రాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. అయితే మహారాష్ట్రలో ఈ కుట్రలు, కుతంత్రాలతోనే శివసేన, ఎన్సీపీలను చీల్చిన మోదీ.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాననుకున్నారని, కానీ.. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ప్రజల తిరస్కారానికి గురయ్యారన్నారు. తెలంగాణలోనూ మోదీ ఇదే రకమైన ప్రయోగం చేస్తారా లేదా అన్నది చూడాలన్నారు. "ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడు కేసీఆర్, ఆయన కుటుంబమని ఆరోపణలు చేసిన బీజేపీ.. వారితో ఎలా జట్టు కడుతుందన్నదీ ఆ పార్టీ నేతలు ప్రజలకు చెప్పాలి. వీటన్నింటినీ విశ్లేషించడానికి సమయం పడుతుంది" అని రేవంత్ అన్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఉగాది పచ్చడిలా స్వీకరిస్తానన్నారు. పార్టీకి సంతోషకరమైన ఫలితాలు వచ్చినట్లుగానే భావిస్తున్నామని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసకు 39.5 శాతం ఓట్లు వచ్చాయని, ఇప్పుడు 41 శాతం వచ్చాయని వివరించారు. ఈ ఎన్నికలను తమ వంద రోజుల పాలనకు రెఫరెండంగా భావించి తీర్పు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రజలను కోరానని, దానిని స్వీకరించిన ప్రజలు.. 8 సీట్లు ఇచ్చారని తెలిపారు. తమ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సీఎంగా, పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రంలో ఏ సీటు గెలిచినా, ఏ సీటు ఓడినా బాధ్యత తనదేనన్నారు. ఇప్పటిదాకా రోజుకు 18గంటలు పని చేస్తున్న తాము మరో రెండు గంటలు అదనంగా పని చేసి ప్రజల్ని మెప్పించే ప్రయత్నం చేస్తామన్నారు.

**ఏపీతో సమస్యలు పరిష్కరించుకుంటాం..**

ఏపీలో ఏ ప్రభుత్వం ఏర్పడినా స్నేహపూర్వక వాతావరణంలో చర్చించి సమస్యలను పరిష్కరించుకుంటామని రేవంత్ అన్నారు. ఉమ్మడి రాజధాని అంశం చట్టపరంగానే పరిష్కారమైపోయిందని, ఇప్పుడు హైదరాబాద్.. తెలంగాణకు మాత్రమే రాజధాని అని పేర్కొన్నారు. ఆస్తులు, నీటి పంపకాలపై తప్పకుండా చర్చించుకుంటామని, ఇందులో తమకు బేషజాలేమీ లేవని స్పష్టంచేశారు. ఇక ఏపీకి ప్రత్యేక హెూదా ఇస్తామంటూ పార్లమెంటులో అప్పటి ప్రధాని చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నామని రాహుల్‌గాంధీ విస్పష్టంగా చెప్పారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అదేమీ ఎన్నికల హామీ కాదని, చట్టబద్ధతతో కూడిన హామీ అని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తే.. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ఇది వ్యక్తిగా తాను తీసుకునే నిర్ణయం కాదని అన్నారు.

**సీఎంకు టీపీసీసీ అభినందన**

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై టీపీసీసీ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, హర్కార వేణుగోపాల్, వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఈరవత్రి అనిల్ తదితరులు సీఎం రేవంత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. రేవంత్ కృషి ఫలితంగానే 8 సీట్లు వచ్చాయంటూ కొనియాడారు. భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ ఎంపీగా గెలిచిన కడియం కావ్య...రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

**మోదీని ప్రజలు తిరస్కరించారు**

లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గ్యారెంటీని ప్రజలు తిరస్కరించారని, ఆయన మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదని రేవంత్‌రెడ్డి అన్నారు. "పార్టీ మేనిఫెస్టో, పది మంది నాయకుల ఫొటోలతో 2014 ఎన్నికలకు బీజేపీ వెళ్తే 273 సీట్లు వచ్చాయి. 2019లోనూ ముగ్గురు, నలుగురు నేతల ఫొటోలు, మేనిఫెస్టోతో వెళ్తే 303 సీట్లు వచ్చాయి. కానీ, 2024 ఎన్నికల్లో పార్టీని, ఆ పార్టీలోని ఇతర నాయకత్వాలను పక్కన పెట్టి.. మోదీ గ్యారెంటీ పేరుతో ప్రజల దగ్గరికి వెళ్లారు. దీంతో 303 సీట్ల నుంచి 240 సీట్లకు పడిపోయింది. మోదీ గ్యారెంటీని దేశ ప్రజలు తిరస్కరించారు" అని రేవంత్ అన్నారు. రాజకీయాల్లో ఆదర్శంగా ఉండాల్సిన మోదీ.. స్వయంగా తప్పుకొంటే గౌరవం దక్కుతుందని, లేదంటే ప్రజల తీర్పును గౌరవించి.. బీజేపీనే ఆయనతో రాజీనామా చేయించాలని సూచించారు. రాముడి పేరుతో ఓట్లు యాచించడాన్ని ఆ రాముడు కూడా క్షమించలేదని, అందుకే అయోధ్య ఉన్న నియోజకవర్గం ఫైజాబాద్‌లోనూ బీజేపీ ఓడిందని అన్నారు.


# ముద్రగడ పేరు మార్చుకుంటారా...

**కాకినాడ :** ముద్రగడ పద్మనాభం ఇప్పుడు సోషల్ మీడియాకు టార్గెట్ అయ్యారు. పవన్ పిఠాపురంలో ఓడిపోతే తాను పేరు మార్చుకుంటానని ముద్రగడ సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సవాల్ ను గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో జనసైనికులు, నెటిజెన్లు ప్రశ్నించడం ప్రారంభించారు. వైసీపీలో చేరిన ముద్రగడ పవన్ ను టార్గెట్ చేసుకున్నారు. పిఠాపురంలో పవన్ ఓడిస్తానని శపథం చేశారు. అంతటితో ఆగకుండా పవన్ గెలిస్తే తాను ముద్రగడ పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకుంటానని కూడా సవాల్ చేశారు. అది కూడా మీడియా ముఖంగానే. ఇప్పుడు ఏపీలో కూటమి అధికారంలోకి రావడం, పిఠాపురంలో పవన్ భారీ మెజారిటీతో గెలవడంతో జనసైనికులు ముద్రగడను టార్గెట్ చేయడం ప్రారంభించారు.ముద్రగడ పద్మనాభం ఒకానొక దశలో జనసేనలో చేరతారని ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. కానీ పవన్ ఆహ్వానించపోయేసరికి చిన్నబుచ్చుకున్నారు. నేరుగా తాడేపల్లి కి వెళ్లి జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అటు జగన్ సైతం పిఠాపురం బాధ్యతలను ముద్రగడకు అప్పగించలేదు. ఆయన కుమారుడికి ఎటువంటి టిక్కెట్టు కేటాయించలేదు. వైసీపీ అధికారంలోకి వస్తే రాజ్యసభ పదవి ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే వైసీపీలో చేరిన నాటి నుంచి ముద్రగడ పవన్ ను టార్గెట్ చేసుకోవడం ప్రారంభించారు. పిఠాపురంలో పవన్ ను ఓడిస్తానని.. అలా చేయకుంటే తన పేరును మార్చుకుంటారని కూడా చెప్పుకొచ్చారు. అయితే



అనూహ్యంగా ముద్రగడ కుమార్తె నుంచి పవన్ కళ్యాణ్ కు మద్దతు లభించింది. ముద్రగడ చేసిన వ్యాఖ్యలను సొంత కుటుంబ సభ్యులు సైతం తప్పుపట్టారు.అయితే ఇప్పుడు పవన్ గెలుపుతో జనసైనికులు జోష్ తో ఉన్నారు. తెగ సందడి చేస్తున్నారు. ఈ తరుణంలో గతంలో ముద్రగడ చేసిన శపథాన్ని గుర్తు చేస్తున్నారు. పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. ఉదయం జనసేన లీడింగ్ లోకి వచ్చిన నాటి నుంచి కొన్ని మీడియా ఛానల్స్ సైతం ముద్రగడ శపథాన్ని గుర్తుచేశాయి. దీంతో ఇవి విపరీతంగా వైరల్ అయ్యాయి. అయితే సీఎం జగన్ ఇప్పటికే తన పదవికి రాజీనామా చేశారు. అటు ఓటమిపై స్పందించేందుకు వైసిపి నేతలు ఎవరు ముందుకు రావడం లేదు. మరి ముద్రగడ పద్మనాభం ఆ శపథంపై ఎటువంటి ప్రకటన చేస్తారో? అన్నది తెలియాల్సి ఉంది.

## కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ..



-మొదటి పేజీ తరువాయి

తెలుసుకోవడానికి తెలుగు ప్రజలు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు.

**ఏమేం తీసుకోవచ్చు..?**

టీడీపీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు తక్కువలో తక్కువ నాలుగు నుంచి ఐదు శాఖలు, లోక్‌సభ స్పీకర్ పదవిని కోరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇందులో.. ఆర్థికశాఖ, ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, వ్యవసాయ శాఖ ఉన్నట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం. దీన్ని బట్టి చూస్తే దాదాపు కీలక శాఖలన్నీ టీడీపీ చేతిలోకి వచ్చేస్తాయ్. ఈ శాఖలనే రేపో మాపో.. ఎన్డీఏ పెద్దలు, మరీ ముఖ్యంగా నరేంద్ర మోదీ, అమిత్ షాలతో చర్చించే అవకాశాలు ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ ఇవి ఒప్పుకోని పరిస్థితుల్లో ఇతర ఏ శాఖలు అడగొచ్చు అనే దానిపై పవన్, చంద్రబాబు ఓ క్లారిటీతో ఉన్నట్లుగా తెలియవచ్చింది. ప్రత్యేక హెూదా మాత్రం పక్కాగా ఇవ్వాల్సిందేనని గట్టిగా పట్టుబట్టే ఛాన్స్ ఉందట. ఇవన్నీ ఒక ఎత్తయితే ఎవరెవర్ని కేంద్ర కేబినెట్‌లోకి పంపించాలనే దానిపై నిశితంగా చర్చ జరిగిందని.. ఇందులో ఇద్దరు యంగ్ ఎంపీలు, మరో ముగ్గురు సీనియర్లను సెలక్ట్ చేశారని గుసగుసలు నడుస్తున్నాయి.

**జాతీయ మీడియా ప్రకారం..!**

కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ అనేదానిపై ప్రాంతీయ మీడియాతో పాటు జాతీయ మీడియాలో కూడా పెద్ద ఎత్తునే చర్చ జరుగుతోంది. చంద్రబాబు మనసులో ఏముంది..? ఏయే శాఖలు అడిగే అవకాశం ఉంది..? అని పెద్ద ఎత్తునే కథనాలు వస్తున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రబాబు కీలకం కాబట్టి 05 నుంచి 06 శాఖలు డిమాండ్ చేసే అవకాశముందని ఇండియా టుడేలో సంచలన కథనమే వచ్చింది. ఈ కథనం ప్రకారం ఆర్థిక శాఖ, విద్య- వైద్య శాఖ, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్, జల్‌శక్తి, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్, రోడ్డు రవాణా శాఖతో పాటు లోక్‌సభ స్పీకర్ పదవి కూడా అడిగే ఛాన్స్ ఉందని జాతీయ మీడియా చెబుతోంది. మరి ఇందులో ఎన్ని శాఖలు దక్కుతాయి..? అనేదానిపై క్లారిటీ రావాలంటే ఒకట్రెండు రోజులు ఆగాల్సిందేనేమో..!!

## ప్రతి ఓటూ బాధ్యత గుర్తుచేసేదే




-మొదటి పేజీ తరువాయి

సొమ్మును ఓ ప్రజా ప్రతినిధిగా జీతం రూపంలో బాధ్యతగా తీసుకుంటాను. నేను రూపాయి జీతం తీసుకుంటాను లాంటి ఆర్భాటపు మాటలు మాట్లాడను. ప్రజా ఖజానా నుంచి సంపూర్ణ జీతం తీసుకుంటాను. ఎందుకంటే ప్రజలు... 'మా పన్నుల ద్వారా వచ్చిన డబ్బును జీతంగా తీసుకుంటున్నావు. మాకు పనులు ఎందుకు చేసి పెట్టవు?' అని అడగడానికి వారికి అజమాయిషీ ఉంటుంది. నాకు కూడా ప్రజల డబ్బులు జీతంగా తీసుకుంటున్నానే బాధ్యత నిరంతరం ఉంటుంది. ప్రజల నుంచి ఎంత జీతం తీసుకున్నా వెయ్యి రేట్లు దానికి మించి వారికి కష్టాల్లో ఇస్తాను. ప్రజలకు అన్ని కష్టాల్లో అండగా నిలుస్తాను. శాసనసభ సమావేశాలు, ప్రజాప్రతినిధుల మాటలు, టీవీల్లో చూస్తున్నప్పుడు భావితరాల వారు వాటిని స్ఫూర్తిగా తీసుకునేలా జనసేన నాయకులు మాట్లాడాలి. రాజకీయాలను కెరీర్ చేసుకోవాలనే స్ఫూర్తిని యువతలో నింపేలా జనసేన ముందుకు సాగుతుంది. ఇప్పటి వరకూ దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి ఇవ్వని గెలుపును రాష్ట్ర ప్రజలు జనసేనకు అందించారు. ఇదో పెద్ద బాధ్యత. దానిని అంతే సక్రమంగా నిర్వర్తించాలి. ప్రజాప్రతినిధులు అంటే ఇంత అద్భుతంగా ఉంటారా అని ప్రజలు మెచ్చుకునేలా పనిచేద్దాం. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా జనసేన కార్యాలయం తలుపులు తెరిచే ఉంటాయి' అని పవన్ చెప్పారు.

## మోదీ పేరు ఏకగ్రీవం..

-మొదటి పేజీ తరువాయి

రాష్ట్రపతిని కలుసుకోనున్న ఎన్డీయే ప్రతినిధుల బృందం

కాగా, ఎన్డీయే కీలక సమావేశం పూర్తికావడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకునేందుకు ఎన్డీయే ప్రతినిధి బృందం సిద్ధమవుతోంది. రాత్రి 7.30 గంటలకు రాష్ట్రపతిని కలుసుకోనున్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రపతిని ప్రతినిధి బృందం కోరనుంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం తమకు ఉందంటూ భాగస్వామ్య పార్టీల మద్దతుతో కూడిన లేఖను అందజేయనుంది. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ ఈనెల 8న ప్రమాణస్వీకారం చేసేందుకు నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

**17వ లోక్‌సభ రద్దు**

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సొంతంగా 240 సీట్లు గెలుచుకున్నప్పటికీ మెజారిటీకి దూరంగా ఉండిపోయింది. అయితే, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి 292 సీట్లు గెలుచుకోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ 272ను అవలీలగా దాటింది. కాగా, 18వ లోక్‌సభ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ, 17వ లోక్‌సభను రద్దు చేయాల్సిందిగా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం నిర్ణయం తీసుకుంది. అనంతరం ప్రభుత్వ రాజీనామాను ప్రధాన మోదీ స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారు. వెంటనే ఆమోదించిన రాష్ట్రపతి కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసేంత వరకూ ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు.

## జైలు నుంచి గెలిచిన అమృత్ పాల్ సింగ్

**ఛండీఘడ్ :** సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వెలువడ్డాయి. దేశ వ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తించిన ఈ ఫలితాల్లో ఊహించని వ్యక్తులు ఓటమి పాలవ్వడం, అసలు ఊహించని వ్యక్తులు గెలుపొందడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.ఓ వైపు ఎన్నికల్లో భారీగా ప్రచారాలు చేసిన బడా నాయకులు కూడా గెలుపొందుతున్న క్రమంలో, వారికే పోటీ ఇస్తూ జైలు నుంచి పోటీ చేసిన ఓ స్వతంత్ర అభ్యర్థి గెలుపొందడం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. పంజాబ్ లో వేర్పాటు వాది అయిన అమృత్ పాల్ సింగ్ సార్వత్రిక ఎన్నికలు 2024లో ఘన విజయం సాధించారు. ఖదూర్ సాహిద్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి కుల్బీర్ సింగ్ జీరాపై 1.78 లక్షల భారీ మెజార్టీతో గెలుపొందారు.అయితే అమృత్ పాల్ సింగ్ జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టై అస్సాంలోని దిబ్రూగఢ్ జైలులో ప్రస్తుతం ఖైదీగా ఉన్నారు.

# నిత్యం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

## నీలం మధుకు భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులను కలుపుకుని నీలం మధు కష్టపడి పని చేసినా తృటిలో సీటును చేజార్చుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఫలితాలు వెలువడిన సంధర్బంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మంత్రివర్యులు కొండా సురేఖ గారితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓటమి పట్ల బెంగ పడాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీలం మధు ను సముదాయించారు. విజయం దగ్గర దాకా వచ్చి చేజారిందని అంతమాత్రాన బాధపడాల్సిన పనిలేదన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చెమటోడ్చి కష్టపడిన తృటిలో విజయం చేజారిందని తెలిపారు. ఓటమికి సంబంధించిన కారణాలను విశ్లేషణ చేసుకొని సమన్వయంతో ముందుకు వెళ్తూ ప్రజా పాలనలో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని నీలం మధుకు సీఎం సూచించారు. నీలం మధు కు నేనున్నానని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



# కార్పొరేట్ ప్రవేట్ కళాశాలలో ఫీజుల నియంత్రణ ఏది?

**వాస్తవ నేస్తం,బోనకల్:** ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా పలువురు ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజుల నియంత్రణ ఏది అని, విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకపోయినా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు తరగతులు ఎలా ప్రారంభిస్తారు అని ఆయన ప్రశ్నించారు. కొన్ని కళాశాలలో అడ్మిషన్లు అయిపోయాయని బోర్డు పెట్టడం బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చోద్యం చూస్తున్నారు తప్ప గుర్తింపు లేని కళాశాలలును గుర్తించి ఆ కళాశాలల పై చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వ అధికారులు గానీ దొంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను సంతలో సరుగ్గా మార్చేశాయి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆయా విద్యా సంస్థలు మార్కెట్ కేంద్రాలుగా



మార్కెట్ చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపార పరం చేస్తున్న జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆయా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల కళాశాలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు అడ్మిషన్స్ తీసుకుంటే డొనేషన్లు బుక్స్ కు సెపరేట్ యూనిఫామ్ సపరేట్ ఫీజులు వసూలు దందా కీ పురి కలుపుతున్నారు అని అన్నారు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ఈ జిల్లాలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు బనాయించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. హైదరాబాద్ తర్వాత విద్యా రంగంలో అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో వివిధ అకాడమీ ల పేర్లతో ఇంటర్మీడియట్ అడ్మిషన్ చేస్తూ ఫీజుల దందా చేస్తున్న అకాడమీయులపై చర్యలు తీసుకోవాలి అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యకునుగుణంగా మరుగుదొడ్లు మూత్రశాలలు మరియు సకాలంలో పాఠ్యపుస్తకాలు మరియు శిథిలా వస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా సమితి కోరు తుంది. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగుల మేర శివ వంశి జిల్లా నాయకులు హరికృష్ణ సతీష్ నరేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ ప్రక్షాళన షురూ

**నిజామాబాద్ :** లంగాణలో పలు జిల్లాలలో ఆర్టీఓ కార్యాలయాలలో , బోర్డర్ చెక్ పోస్ట్ లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. నల్గొండ, కరీంనగర్, మహబూబాబాద్, సిద్ధిపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని రోడ్డు రవాణా శాఖ కార్యాలయాలపై ఒకేసారి అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. ఆర్టీఏ ఏజెంట్లు, ఆఫీసర్లను విచారిస్తున్నా రు. బీఆర్ఎస్ పాలనలో ఇన్నాళ్లు అడ్డూ అదుపూ లేకుండా సాగిన రవాణా శాఖ అధికారుల ఆగడాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దాదాపు గత ఐదారేళ్లుగా రాష్ట్రంలోని ఆర్టీఏ కార్యాలయాలు, చెక్ పోస్టులలో భారీ ఎత్తున అవినీతి కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ మంగళవారం జరిపిన దాడుల్లో విస్తుపోయే అంశాలు బయటపడ్డాయి. ఏకంగా కార్యాలయాలలోనే పెద్ద మొత్తంలో డబ్బులు దొరికాయి. ఇన్ని జరుగుతున్నా ఆర్టీఏ ఉన్నతాధికారులు మౌనంగా ఉన్నారంటే క్షేత్ర స్థాయిలో జరిగే తంతు మొత్తం వీళ్లకి తెలిసే జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా శాఖలో ఆన్ లైన్ సర్వీసులు అంటూ ఎంత ఊదరగొట్టినా..ఆర్టీఏ బ్రోకర్లదే హవా. ఆర్టీఏ శాఖలో కొందరు ఉన్నతాధికారులు ప్రైవేటుగా కొందరు బ్రోకర్లను నియమించుకుని వాహనదారులనుంచి అడ్డగోలుగా లంచాలు వసూళ్లు చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. యావరేజ్ న ఒక్కో చెక్ పోస్ట్ లో ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది కోట్ల మేరకు అవినీతి జరుగుతోందని అంచనా.పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే టూ వీలర్ కు ఓ రేటు, కారుకు మరో రేటు, స్కూళ్లు, కాలేజీల వంటి బస్సుల లైసెన్స్ లకు మరో రేటు, రవాణా వాహనాల ఫిట్ నెస్ రెన్యువల్ కు ఓ రేటు, లెర్నర్ లైసెన్సుకు కంప్యూటర్ పరీక్షకు ఓ రేటు చొప్పున వసూలు చేస్తున్నారు. ఒకవేళ వాహనదారులు నేరుగా వెళితే ఏదో ఒక సాకు చెప్పి వాళ్లను మళ్లీ మళ్లీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ చివరాఖరికి బ్రోకర్లే శరణ్యం అనేటట్లు చేస్తున్నారు. ఇలా బ్రోకర్ల ద్వారా వెళ్లే అప్లికేషన్లకు పెన్సిల్ తో ఓ కోడ్ ఉంటుంది. ఆ కోడ్ చూడగానే వెంటనే పనులు చకచకా అయిపోతాయి.అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు సైతం అక్రమాలకు అడ్డాగా మారాయి. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో ఉన్న అశ్వారావుపేట చెక్ పోస్టులో భారీ ఎత్తున



అవినీతి జరుగుతోంది. ఇక్కడ సంవత్సరానికి ఏడు నుంచి ఎనిమిది కోట్ల అవినీతి జరుగుతోందని అంచనా. అప్లికేషన్లు, అనుమతులు అన్నీ కరెక్ట్ గానే ఉన్నాయంటూ లంచం ఇవ్వకుండా వెళుతున్నా లారీలను వెంబడించి కేసులు పెట్టి వాళ్ల నుంచి 20 వేల రూపాయలు జరిమానాలు విధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బడి బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలకు ఫిట్ నెస్ రెన్యువల్ సర్టిఫికెట్లు కేవలం బ్రోకర్ల ద్వారా వస్తేనే పనులు జరుగుతున్నాయిరంగారెడ్డి జిల్లాలో ఓ కీలక కార్యాలయానికి కొద్దినెలల క్రితం కొత్త అధికారి వచ్చాక ప్రైవేటు వ్యక్తులను ఆర్టీఏ కార్యాలయంలోకి అనుమతించడం ఆపేశారు. సదరు అధికారి సెలవులో ఉన్నప్పుడు కిందిస్థాయి అధికారులు దళారులకు ఎర్రతివాచీ పరుస్తున్నారు. పాత వాహనాలకు యజమాని వివరాలు మార్చాలన్నా ఇక్కడ డబ్బు ముట్టజెప్పాల్సిందే. వాహనాల ఫిట్ నెస్ పరీక్షకు ఆటోకు రూ.300, ట్రాక్టర్ కు రూ.500 చొప్పున ఇవ్వాలి. కామారెడ్డి జిల్లాలో ఓ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులో కొద్ది కాలం క్రితం ఏకంగా 21 మంది రవాణా అధికారులు డిప్యూటేషన్ పై కొనసాగారు. హై లెవెల్ పైరవీలతో చాలాకాలం పాటు తిష్టవేసిన వారిని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి పింపింది. ఇక్కడ ఉన్న ఉన్నతస్థాయి అధికారులు దాదాపు 20 మంది ప్రైవేటు సిబ్బందిని నియమించుకున్నారు. వారి ద్వారా రోజుకు 15 లక్షలకు పైగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా చూసుకుంటే ఆర్టీఏ శాఖలో ఇలాంటి వసూల్ రాజాలను ప్రోత్సహించింది బీఆర్ఎస్ సర్కారే అన్నది అర్థమవుతోంది.తెలంగాణలో అవినీత రహిత పాలన అందిస్తామని, అవినీతికి ఎవరు పాల్పడినా ఉపేక్షించమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు అనుగుణంగా అవినీతి నిరోధక శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే దశాబ్దాలుగా ఆర్టీఓ కార్యాలయాలలో పేరుకుపోయిన లంచగొండుల పనిపట్టే పనిలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో లంచాలతో బదిలీలను ఆపుకుంటూ ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసుకుని కూర్చున్న అధికారులకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం చుక్కలు చూపించనుంది.

## చెట్లని పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ మరియు దేవేందర్ రాజ్ పటాన్ చెరులోని ఎండిఆర్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. భవిష్యత్తు తరాలకు పచ్చని ప్రకృతిని అందించడం అందరి బాధ్యత అని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

## నైతిక విజయం కాంగ్రెస్ దే...

**కాంగ్రెస్కి ఓటేసిన ప్రతి ఒక్కరికి ఋణపడి ఉంటా: నీలం మధు**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మెదక్ పార్లమెంటు ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓటమి చెందిన నైతిక విజయం కాంగ్రెస్ పార్టీ దేనని ఆ పార్టీ అభ్యర్థి నీలం మధు అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఫలితాలు అనంతరం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ బిజెపి బిఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందంలో భాగంగా ఒక్కటై బీసీ బిడ్డను ఓడించడానికి కుట్ర చేశారని ఆరోపించారు.రెండు పార్టీల అంతర్గతంగా ఒప్పందంతో బిజెపి అభ్యర్థిని గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీ బిడ్డకు అవకాశం కల్పిస్తే ఓర్వలేక కుట్రలు పన్నారన్నారు. అయినా ప్రజలు ఆ పార్టీల కుట్రలను తిప్పికొడుతూ తనకు నైతిక విజయం అందించేలా ఓట్లను వేశారన్నారు. ఇందిరమ్మ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు నుంచి తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ మల్లికార్జున కార్గే, రాహుల్ గాంధీ ల తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ లను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు కోసం కష్టపడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు తనను కుటుంబ సభ్యుడిలా ఆదరించి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఓడినా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన గెలుపు కోసం కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

## ఇంటర్నేషనల్ స్టార్ గ్లోబల్ అవార్డును అందుకున్న దళిత రత్న ఏర్పుల శ్రీనివాస్




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా, జిన్నారంలోని మండలం జిన్నారం గ్రామానికి చెందిన దళితరత్న ఏర్పుల శ్రీనివాస్ విద్యార్థి దశ నుండి నేటి వరకు అనేక సామాజిక కార్యక్రమాలతో మహనీయులను, మరియు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, లను స్ఫూర్తిగా తీసుకొని ఆ మహనీయుల ఆశయ సాధన కోసం, భారత రాజ్యాంగం లో ఉన్న హక్కులను ప్రతి పౌరుడికి అందే విధంగా సామాజిక పోరాటం దిశగా పనిచేస్తున్నందున తన సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ వర్తి వెల్నెస్ ఫౌండేషన్ వారు గుర్తించి ఇంటర్నేషనల్ స్టార్ గ్లోబల్ గౌరవ అవార్డు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా వెన్న అంటూ ఉంటూ సంపూర్ణ సహకారంతో అహర్నిశలు సంపూర్ణ సహకారాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు వచ్చిన సందర్భంగా బాధ్యత మరింత పెరిగింది అని సామాజిక కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొంటామన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు పలువురు ప్రశంసించారు.

## అందుబాటులో జనుము విత్తనాలు: ఏఓ శ్రీనివాస్ రావు



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రం లోని సహకారం సంఘ గోదాంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... నలబై కిలలో జనుము విత్తనాల బ్యాగ్ అసలు ధర 3620రూపాయలు కాగా రైతులకు సబ్సిడీ రూపంలో ఒక బ్యాగ్ 1448 రూపాయలకే అందిస్తుమని ఆయన తెలిపారు. కావాలనుకునే రైతుల కోసం 70బ్యాగులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విత్తనాల శాంపిల్స్ను సేకరించారు. ఆయన వెంట ఏఈఓ లు అస్మా బేగం,గంగా సాగర్, సహకారం సంఘం సిబ్బంది నవీన్, సాయి కుమార్ తదితరులు ఉన్నారు.

## పిఎంపి క్లినిక్లను తనిఖీ చేసిన అధికారులు



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండలంలో మండల వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పిఎంపి క్లినిక్ల తనిఖీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని కొత్తపల్లి,ఎత్తోండ గ్రామాలలో ఉన్న పిఎంపి క్లినిక్లను ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ స్థానిక సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పిఎంపీలు చేస్తున్న చికిత్స వారి యొక్క పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఆయన వెంట స్థానిక సిబ్బంది ప్రమీల,లలిత,సరోజ తదితరులు పాల్గొన్నారు.